సాక్షి
తూర్పుగోదావరి
శుక్రవారం । 31 । మార్చి । 2023



గౌతమీ తీరం.. కల్యాణ సంరంభం
కోనసీమ తిరుపతి.. వాడపల్లి క్షేత్రం కల్యాణ శోభను అద్దుకుంటోంది. శ్రీదేవి, భూదేవి సమేతుడై, శ్రీ వేంకటేశ్వర స్వామి వారి కల్యాణోత్సవాలు శుక్రవారం ప్రారంభం కానున్నాయి.
8లో



అన్నదానానికి విరాళం
ద్వారకాతిరుమల: శ్రీవారి నిత్యాన్నదాన ట్రస్టుకు కూరపాటి గంగరాజు (తాడేపల్లిగూడెం) గురువారం రూ.1,01,116 విరాళం సమర్పించారు.

ఏప్రిల్ 2న ప్రత్యేక రైలు



రాజమహేంద్రవరం సిటీ: ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ఏప్రిల్ 2న సికింద్రాబాద్ – అగర్తలా మధ్య (07018) నంబరు వన్‌వే స్పెషల్ రైలు నడపనున్నట్లు రైల్వే అధికారులు ప్రకటించారు.



న్యూస్‌రీల్

ఒకటిన జాబ్‌మేళా

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): కలెక్టరేట్‌లోని వికాస కార్యాలయంలో ఏప్రిల్ ఒకటో తేదీన జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు ప్రాజెక్టు డైరెక్టర్ కె.లచ్చారావు గురువారం ప్రకటనలో తెలిపారు. పదో తరగతి నుంచి డిగ్రీ, ఐటీఐ, డిప్లొమా, బీటెక్ ఉత్తీర్ణులైన 40 ఏళ్లలోపు అభ్యర్థులు అర్హులన్నారు. ఉదయం పది గంటల నుంచి సర్టిఫికెట్లతో హాజరు కావాలన్నారు. మరిన్ని వివరాలకు 83090 10013 నంబర్‌ను సంప్రదించాలన్నారు.

3 నుంచి పింఛన్ల పంపిణీ

రాజమహేంద్రవరం రూరల్: వైఎస్సార్ పింఛన్ కానుక పంపిణీని ప్రభుత్వ సెలవుల కారణంగా ఏప్రిల్ 3వ తేదీ నుంచి అందజేయనున్నారు. ఈ విషయాన్ని డీఆర్‌డీఏ–వైఎస్సార్‌క్రాంతి పథం ప్రాజెక్టు డైరెక్టర్ సిరిపురపు సుభాషిణి ప్రకటనలో తెలిపారు. ఏప్రిల్ ఒకటో తేదీ ఆర్థిక సంవత్సరం ముగింపు, దేశవ్యాప్తంగా బ్యాంకులకు సెలవు, రెండో తేదీ ఆదివారం కావడంతో 3 నుంచి పింఛన్లు పంపిణీ చేస్తామన్నారు. లబ్ధిదారులందరూ ఈ విషయాన్ని గమనించాలని ఆమె కోరారు.

సత్యదేవుని దర్శించిన 25 వేల మంది



సత్యదేవుని దర్శనానికి క్యూ కట్టిన భక్తులు

అన్నవరం: రత్నగిరిపై సత్యదేవుని దర్శనానికి గురువారం భక్తులు పోటెత్తారు. శ్రీరామ నవమిని పురస్కరించుకుని తెల్లవారుజాము నుంచి ఆలయానికి భక్తులు తరలివచ్చారు. సుమారు 25 వేల మంది స్వామి వారిని దర్శించారు. ఉచిత దర్శనానికి గంట, అంతరాలయ దర్శనానికి అరగంట పట్టింది. వ్రతాలు 1,500 జరిగాయి. అన్ని విభాగాల ద్వారా దేవస్థానానికి రూ.30 లక్షల ఆదాయం సమకూరిందని అధికారులు తెలిపారు.

ఉప ఆలయాల్లోనూ నేతి దీపాల వెలుగులోనే దేవతామూర్తుల దర్శనం

రత్నగిరిపై రామాలయంలోని సీతారాములు, వనదుర్గ, కనకదుర్గ ఆలయాల్లోని అమ్మవార్లు గురువారం ఆవు నేతి దీపాల వెలుగులోనే భక్తులకు దర్శనమిచ్చారు. చాలా కాలంగా సత్యదేవుడు, అనంతలక్ష్మి సత్యవతీదేవి అమ్మవార్లు మాత్రమే భక్తులకు ఆవు నేతి దీపాల వెలుగులో దర్శనమిస్తున్నారు. సీతారాములు, వనదుర్గ, కనకదుర్గ అమ్మవార్ల ఆలయాల్లో మాత్రం విద్యుద్దీపాల కాంతుల్లో స్వామి, అమ్మవార్లు భక్తులకు దర్శనమిస్తున్నారు. గురువారం ఆ ఆలయాలకు వెళ్లిన ఈఓ చంద్రశేఖర్ అజాద్ అక్కడ విద్యుద్దీపాల వెలుగులో స్వామి, అమ్మవార్లు భక్తులకు దర్శనమిస్తున్న విషయం గమనించారు. ఈ ఆలయాల్లో కూడా ఆవునేతి దీపాల వెలుగులోనే స్వామి, అమ్మవార్ల దర్శనానికి ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు.

కమనీయం.. కల్యాణ శోభ



రాముల వారి కల్యాణం తిలకిస్తున్న ముఖ్యమంత్రి జగన్ ముఖ్య సలహాదారుడు అజయ కల్లాం, కలెక్టర్లు కృతిక శుక్లా, హిమాన్షు శుక్లా దంపతులు, ఎమ్మెల్యే సత్తి సూర్యనారాయణరెడ్డి దంపతులు



జి.మామిడాడలోని రాముల వారి కల్యాణాన్ని తిలకిస్తున్న భక్తులు,



కల్యాణం ఘట్టంలో భాగంగా మంగళసూత్రం చూపిస్తున్న అర్చకుడు

- గొల్లలమామిడాడలో భక్తిశ్రద్ధలతో కోదండ సీతారాముడి కల్యాణ వేడుక
- భక్త జనం సంద్రంగా మారిన గ్రామం
- పట్టు వస్త్రాలు సమర్పించిన కలెక్టర్లు

పెదపూడి: వేద పండితుల మంత్రోచ్చారణలు.. మంగళ వాయిద్యాల హోరు.. భక్తుల శ్రీరామ నామస్మరణ మధ్య కోదండ రాముని కల్యాణం కమనీయంగా జరిగింది. కాకినాడ జిల్లా పెదపూడి మండలం గొల్లల మామిడాడలో కోదండ సీతారాముని కల్యాణ వేడుక వైభవంగా జరిగింది. గురువారం తెల్లవారుజాము నుంచే ఆలయ సమీపంలోని కోనేరులో భక్తులు పుణ్యస్నానాలు ఆచరించడం మొదలైంది. అనంతరం స్వామివారి దర్శనానికి వారు బారులు తీరారు. ఉదయం 6 గంటల నుంచి దర్శన భాగ్యం కల్పించారు. దూర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తజనంతో ఆలయ ప్రాంగణం కిటకిటలాడింది.

శ్రీకారం చుట్టారిలా..

ఉదయం 11.20 గంటలకు స్వామి వారిని కల్యాణ వేదిక వద్దకు తీసుకు వచ్చారు. స్వామిని ముఖ్యమంత్రి ముఖ్య సలహాదారు అజయ్ కల్లాం దర్శించుకున్నారు. ప్రభుత్వం తరఫున కాకినాడ జిల్లా కలెక్టర్ కృతికా శుక్లా, ఆమె భర్త డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా, ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి, ఆదిలక్ష్మి దంపతులు సీతారాములకు పట్టువస్త్రాలు, తలంబ్రాలు సమర్పించారు. స్వామి వారిని దేవదాయ, ధర్మదాయ శాఖ జోన్–2 డిప్యూటీ కమిషనర్ ఎం.విజయరాజ్, జిల్లా జడ్జి మాధవీలత దర్శించుకున్నారు. అమ్మిరెడ్డి చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ ద్వారంపూడి వెంకటరెడ్డి, పలువురు భక్తులు స్వామి వారికి మంచి ముత్యాలను తలంబ్రాలుగా సమర్పించారు. 11.35 గంటలకు ఆలయ ధర్మకర్త ఇంటి నుంచి మంచి ముత్యాలు, తలంబ్రాలు, తొమ్మిది రకాల పండ్లు, పుష్పాలు, పట్టు వస్త్రాలను పల్లకిలో ఊరేగింపుగా వేదిక వద్దకు తీసుకొచ్చారు. కల్యాణ వేడుక ముగిశాక భక్తులకు మంచి ముత్యాలు తలంబ్రాలు, బియ్యం పంపిణీ చేశారు.

ఘనంగా సీతారాముల కల్యాణం



సీతారాముల కల్యాణం నిర్వహిస్తున్న ఎంపీ భరత్‌రామ్, మోనా దంపతులు, చిత్రంలో హోంమంత్రి తానేటి వనిత

రాజమహేంద్రవరం రూరల్: స్థానిక వీఎల్ పురం మార్గాని ఎస్టేట్స్ ప్రాంగణంలోని ఎంపీ కార్యాలయంలో సీతారాముల కల్యాణోత్సవం గురువారం ఘనంగా నిర్వహించారు. ఎంపీ భరత్‌రామ్, మోనా దంపతులతో శాస్త్రోక్తంగా వేద పండితుడు వెంపరాల కృష్ణశర్మ ఈ కార్యక్రమం జరిపించారు. రాష్ట్ర హోంమంత్రి తానేటి వనిత, డీసీసీబీ అధ్యక్షుడు ఆకుల వీర్రాజు, జనసేన జిల్లా అధ్యక్షుడు కందుల దుర్గేష్, కార్పొరేషన్ కమిషనర్ కె.దినేష్ కుమార్, మాజీ ఎమ్మెల్యే రౌతు సూర్యప్రకాశరావు తదితరులు తరలివచ్చారు. వివాహకర్తలుగా పీటలపై ఆశీనులైన ఎంపీ భరత్‌రామ్, మోనా, కుమార్తెలు జయాని, శివాన్ని రామ్‌ను ఆశీర్వదించారు. స్వామి కల్యాణ విశిష్టత, ఆయా క్రతువుల గొప్పతనాన్ని మహా మహోపాధ్యాయ విశ్వనాథ గోపాలకృష్ణ వివరించారు. ఎంపీ భరత్‌రామ్ తల్లిదండ్రులు మార్గాని నాగేశ్వరరావు, ప్రసూన, ఎంపీ సోదరుడు విజయకృష్ణ, సోదరి ఆరేపల్లి జ్యోత్స్న సాదరంగా ఆహ్వానించి మర్యాదలు చేశారు. పార్టీ నగర అధ్యక్షుడు అడపా శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.


కల్యాణ ఘట్టంలో అపురూప ఘడియలు



- మధ్యాహ్నం 12.30 గంటలకు కల్యాణ సంకల్పం ఘనంగా ప్రారంభమైంది.
- 12.54: విష్వక్సేన పూజ.
- 1.07: సంప్రోక్షణ.
- 1.29: రక్షబంధన్ నిర్వహించారు.
- 1.42: యజ్ఞోపవీత ధారణ.
- 1.54: కల్యాణమూర్తులకు పూలమాలల అలంకరణ, కన్యాదానం.
- 2.11: సుముహూర్తాన కల్యాణమూర్తుల శిరస్సులపై జీలకర్ర – బెల్లం ఉంచారు.
- స్వామి వారికి పట్టు వస్త్రాల సమర్పణ, మంగళ హారతి.
- 2.23: రాముల వారితో మాంగల్య సూత్రధారణ.
- 2.34: కల్యాణ ఘట్టం ముగిసింది.

రబీకి మరికొన్నాళ్లు సాగునీరు

- 70 శాతం మాత్రమే సాగు పూర్తి
- మరో 15 రోజుల పాటు నీరు అవసరం
- రేపటి నుంచి తాగునీటి అవసరాలకు..



తూర్పు డెల్టా కాలువకు విడుదలవుతున్న నీరు

ధవళేశ్వరం: రబీ సాగు చివరి దశకు చేరింది. ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల పరిధిలో 8.96 లక్షల ఎకరాల్లో సాగు అవసరాలకు కాటన్ బ్యారేజీ నుంచి ఇప్పటి వరకూ 80 టీఎంసీల నీటిని విడుదల చేశారు. ఇందులో సీలేరు జలాలు 41.39 టీఎంసీలు. మిగిలినవి గోదావరి సహజ జలాలు. గత ఏడాది డిసెంబర్ 15 నుంచి రబీకి నీటి విడుదల ఆరంభించారు. వాస్తవానికి ఈ నెల 31వ తేదీతో రబీ సీజన్ ముగియాల్సి ఉంది. అయితే ఇప్పటి వరకూ 70 శాతం మేర మాత్రమే సాగు పూర్తయిందన్నది అధికారుల అంచనా. చాలా ప్రాంతాల్లో సాగు పూర్తి కాకపోవడంతో మరో 15 రోజుల పాటు డెల్టా కాలువలకు నీటి విడుదలకు అవకాశం కల్పించాలని అధికారులు నిర్ణయించారు. మరోపక్క వేసవి తీవ్రత పెరుగుతూండటంతో వచ్చే నెల ఒకటో తేదీ నుంచి తాగు నీరు విడుదల చేస్తామని ఇరిగేషన్ అధికారులు ప్రకటించారు.

పూర్తి కానున్న సీలేరు కోటా

సీలేరు నుంచి రబీ సాగుకు విడుదల చేస్తామన్న నీటి కోటా దాదాపు పూర్తి కానుంది. రబీ సాగుకు 43 టీఎంసీలు విడుదల చేస్తామని సీలేరు అధికారులు ముందుగానే స్పష్టం చేశారు. గురువారం నాటికి 41.39 టీఎంసీలు విడుదల చేశారు. మరో 1.61 టీఎంసీల నీటిని విడుదల చేస్తే కోటా పూర్తి కానుంది. రబీ సాగుకు నీటి ఎద్దడి పెరుగుతూండటంతో ఈ నెల మొదటి వారంలో పవర్ జనరేషన్‌తో సంబంధం లేకుండా సీలేరు బైపాస్ ద్వారా నీటిని విడుదల చేశారు. దీంతో సాగునీటి ఇబ్బందులు లేకుండా గోదావరి డెల్టాలో రబీ గట్టెక్కింది. దీనిపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించడంతో రైతులకు మేలు చేకూరింది.

అంచనా 94 టీఎంసీలు

ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల్లోని 8.96 లక్షల ఎకరాల్లో సాగు, తాగు, పరిశ్రమల అవసరాలకు 94 టీఎంసీల నీరు అవసరమని అధికారులు అంచనా వేశారు. ఇందులో తూర్పు డెల్టా పరిధిలో 2,64,553, మధ్య డెల్టాలో 1,72,000, పశ్చిమ డెల్టా పరిధిలో 4,60,000 ఎకరాలకు నీరు ఇస్తున్నారు. ఇప్పటి వరకూ 80 టీఎంసీలు విడుదల చేశారు. మరో 14 టీఎంసీలు విడుదల చేయాల్సి ఉంది. సీలేరు ద్వారా ఏప్రిల్ 1 నుంచి పవర్ జనరేషన్ ద్వారా మాత్రమే నీరు విడుదల కానుంది. ప్రస్తుతం సాగునీటి వినియోగం తగ్గుతున్న నేపథ్యంలో ఇక తాగునీటి అవసరాలకు విడుదల చేస్తామని అధికారులు చెబుతున్నారు. ఏప్రిల్ 15 వరకూ వాటర్ ట్యాంకులు, తాగునీటి చెరువులకు నీరు విడుదల చేయనున్నారు.

తాగునీటికి నీరు విడుదల

సాగు నీటి వినియోగం తగ్గింది. వేసవిని దృష్టిలో పెట్టుకుని ఏప్రిల్ 1నుంచి తాగునీటి అవసరాలకు నీటిని విడుదల చేస్తాం. డెల్టా కాలువలను మూసివేతపై తేదీలను కలెక్టర్ల నిర్ణయిస్తారు. సీలేరు నీటి కోటా పూర్తి అయ్యింది. పవర్ జనరేషన్ ద్వారా విడుదల అయ్యే నీరు కాటన్ బ్యారేజ్‌కు వచ్చి చేరనుంది.
– జి శ్రీనివాసరావు,ఇరిగేషన్ సర్కిల్ ఎస్ఈ, ధవళేశ్వరం

వైభవంగా శ్రీరామ శోభాయాత్ర





శ్రీరామనవమి పర్వదినాన్ని పురస్కరించుకుని రాజమహేంద్రవరంలో గురువారం శ్రీరామ శోభాయాత్ర బైక్‌ర్యాలీని ఘనంగా నిర్వహించారు. పుష్కర ఘాట్ నుంచి ఆర్యాపురం, నందం గనిరాజు జంక్షన్, గోరక్షణపేట, ఏవీఏ రోడ్డు, పాత సోమాలమ్మ ఆలయం, ఆర్టీసీ కాంప్లెక్స్, స్టేడియం రోడ్డు మీదుగా మళ్లీ పుష్కరఘాట్‌కు చేరుకుంది. ఈ ర్యాలీని ఎంపీ భరత్‌రామ్ ప్రారంభించారు. శ్రీనివాసానంద సరస్వతి స్వామీజీ తదితరులు పాల్గొన్నారు.
– సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం)

కలుషిత నీటి కష్టాలకు సెలవ్

- జిల్లా వ్యాప్తంగా అంగన్ వాడీ కేంద్రాల్లో తాగునీటి శుద్ధి ప్లాంట్ల ఏర్పాటు
- ఒక్కో యూనిట్‌కు రూ.24 వేల ఖర్చు
- దశల వారీగా విస్తరణకు చర్యలు

కొవ్వూరు: అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రభుత్వం స్వచ్ఛమైన తాగునీటిని అందుబాటులోకి తెస్తోంది. ఇప్పటికే ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాలను ప్రైమరీ, ప్రీ–ప్రైమరీ స్కూళ్లుగా మార్చిన సంగతి తెలిసిందే. ఆరోగ్యకర సమాజం కోసం చక్కని పౌష్టికాహారాన్ని అందిస్తున్న సర్కారు నాడు–నేడు పథకాన్ని వర్తింపజేసి ఈ కేంద్రాల రూపు రేఖల్ని మార్చుతోంది. రంగురంగుల బెంచీలు, కుర్చీలు, బ్లాక్ బోర్డులు ఏర్పాటుచేసి ఆకర్షణీయంగా తీర్చుదిద్దుతోంది. కార్పొరేట్ కిడ్స్‌స్కూళ్లకు దీటుగా తయారుచేస్తోంది. తాజాగా మరో అడుగు ముందుకేస్తూ స్వచ్ఛమైన తాగునీరు అందించేందుకు నడుం బిగించింది. ఇందులో భాగంగా మినరల్ వాటర్ ప్లాంట్లను ఏర్పాటు చేస్తోంది. జిల్లా వ్యాప్తంగా 1556 అంగన్‌వాడీ కేంద్రాలున్నాయి. వీటిలో 11,664 మంది గర్భిణులు, 10,584 మంది బాలింతలు, ఆరు నెలల నుంచి మూడేళ్ల లోపు చిన్నారులు 51,909 మంది, మూడు నుంచి ఆరేళ్లలోపు చిన్నారులు 30,663 మంది ఉన్నారు.



కొవ్వూరు మండలం ఆరికిరేవుల అంగన్‌వాడీ కేంద్రంలో ఏర్పాటు చేసిన ఆక్వా మినీ మినరల్ వాటర్ ప్లాంటు

మొదటి విడతలో 282 ప్లాంట్ల ఏర్పాటు

మొదటి విడతగా 282 ఆక్వా మినరల్ వాటర్ ప్లాంట్లను నెలకొల్పారు. సొంత భవనాలున్న కేంద్రాలకు తొలుత ప్రాధాన్యత ఇస్తున్నారు. ప్లాంటుకు రూ.24,029 చొప్పున రూ.67.20 లక్షలుపైగా ఖర్చు చేశారు. 20 లీటర్ల సామర్థ్యం కలిగిన ఆర్వో ప్లాంటును ఏర్పాటు చేస్తున్నారు. ఆర్వో ప్లాంటు గంటకు 12 లీటర్లు చొప్పున తాగు నీరు అందిస్తుంది. నీటి వసతి ఉన్న చోట్ల పైప్‌లైన్‌లకు కనెక్షన్ ఇస్తారు. లేదంటే బయటి నుంచి నీరు తెచ్చుకుని ఆర్వో ప్లాంట్లులో వేయాల్సి ఉంటుంది. ఐదేళ్ల పాటు సంబంధిత కంపెనీ నిర్వహణ బాధ్యతను చూస్తుంది. నీటి నాణ్యతను తెలిపే టీడీఎస్ మీటరు అమర్చి ఉంటుంది. కేంద్ర ప్రభుత్వం పోషణ్ అభియాన్‌లో భాగంగా నేషనల్ న్యూట్రిషన్ మిషన్ ద్వారా ఆంధ్రప్రదేశ్ ఎడ్యుకేషనల్ వెల్ఫేర్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఇంజినీరింగ్ అధికారుల పర్యవేక్షణలో ప్లాంట్లను ఏర్పాటు చేస్తున్నారు.

ఏర్పాటు చేసిన తాగునీటి శుద్ధి ప్లాంట్ల వివరాలు

ప్రాజెక్టు పేరు	మండలం పేరు	ప్లాంట్ల సంఖ్య
కోరుకొండ	కోరుకొండ	78
రంగంపేట	రంగంపేట	09
రాయవరం	అనపర్తి	32
పెరవలి	పెరవలి	24
పోలవరం	తాళ్లపూడి	20
సమిశ్రగూడెం	చాగల్లు	31
గోపాలపురం	గోపాలపురం	27
నల్లజర్ల	నల్లజర్ల	16
కొవ్వూరు	కొవ్వూరు రూరల్	45

దశల వారీగా విస్తరణ



జిల్లా వ్యాప్తంగా అంగన్‌వాడీ కేంద్రాల్లో మినరల్ వాటర్ ప్లాంట్లను ఏర్పాటు చేస్తున్నాం. తొలి విడతలో 282 మినీ మినరల్ వాటర్ ప్లాంట్లను ఏర్పాటు చేశాం. ఇప్పటికే ఇవి వినియోగంలోకి వచ్చాయి. దశల వారీగా మిగిలిన కేంద్రాల్లోనూ ఏర్పాటు చర్యలు తీసుకుంటాం.
– కె.విజయకుమారి,జిల్లా మహిళ,శిశు సంక్షేమ అధికారి

మినరల్ వాటర్ ఏర్పాటు హర్షణీయం



అంగన్‌వాడీ కేంద్రాల్లో మినరల్ వాటర్ ప్లాంట్లు ఏర్పాటు చేయడం సంతోషం. కలుషిత తాగునీరు కారణంగా అనేక రోగాలు వస్తున్నాయి. ఈ ప్లాంటు ఏర్పాటుతో ఈ సమస్య తొలగిపోతుంది. మా కేంద్రంలో రెండు నెలలు నుంచి స్వచ్ఛమైన తాగునీరు లభిస్తోంది.
– టి.ఝాన్సీలక్ష్మీబాయి,అంగన్‌వాడీ కార్యకర్త, ఆరికిరేవుల

బ్రాండ్ కోనసీమ

నేటి నుంచి 'బిజినెస్ వుమెన్ ఎక్స్‌పో – కోనసీమ'

సాక్షి, అమలాపురం: ఇప్పటి వరకూ ప్రకృతి అందాలతో పర్యాటకంగా.. కృష్ణా – గోదావరి (కేజీ) బేసిన్ ద్వారా జాతీయ స్థాయిలో కోనసీమ గుర్తింపు పొందింది. ఇక నుంచి మహిళా స్వయంశక్తి సంఘాలు (ఎస్‌హెచ్‌జీ) తయారు చేసే ఉత్పత్తులకు సైతం 'బ్రాండ్ కోనసీమ' గుర్తింపు రానుంది. స్థానికంగా తయారయ్యే చేనేత, హస్తకళ, క్వాయర్ వంటి ఉత్పత్తులకు.. ఆత్రేయపురం పూతరేకులు, నగరం గరాజీలు, పచ్చళ్లు, పిండి వంటల వంటి ఆహార ఉత్పత్తులకు జాతీయ స్థాయిలో ప్రత్యేక గుర్తింపు తీసుకు వచ్చేందుకు జిల్లా యంత్రాంగం వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. టూరిజం, కేజీ బేసిన్ తరహాలో డ్వాక్రా ఉత్పత్తులకు సైతం ఒక బ్రాండ్ తెచ్చేందుకు 'బిజినెస్ వుమెన్ ఎక్స్‌పో – కోనసీమ' పేరుతో పది రోజుల పాటు ప్రదర్శన నిర్వహించనుంది. అమలాపురం బాలయోగి స్టేడియంలో శుక్రవారం నుంచి ఏప్రిల్ 9వ తేదీ వరకూ పది రోజుల పాటు ఈ మెగా ఈవెంట్ జరగనుంది.

జిల్లాలో ఎస్‌హెచ్‌జీ సభ్యులు పలు రకాల ఉత్పత్తులు తయారు చేస్తున్నారు. కానీ వాటికి స్థానికంగా మార్కెట్ తప్ప రాష్ట్ర, జాతీయ స్థాయిల్లో మార్కెట్ లేదు. అక్కడ కనుక ఈ వస్తువులను విక్రయించగలిగితే మంచి లాభాలు వచ్చే అవకాశముంది. జాతీయ స్థాయిలో మార్కెటింగ్ చేయగలగాలంటే ఎగ్జిబిషన్లు ఒకటే మార్గమని ప్రభుత్వాలు గుర్తించాయి. కేంద్ర ప్రభుత్వం ఇప్పటికే 'సరస్' ఎగ్జిబిషన్లు నిర్వహిస్తోంది. కొత్త జిల్లాలు ఏర్పడటంతో 'మినీ సరస్' పేరుతో రాష్ట్ర ప్రభుత్వం ఈ తరహా ఎగ్జిబిషన్ల నిర్వహణకు శ్రీకారం చుట్టింది. దీనిలో భాగంగా జిల్లాలో పది రోజుల పాటు ఎగ్జిబిషన్ నిర్వహించేందుకు జిల్లా యంత్రాంగం ఏర్పాట్లు పూర్తి చేసింది. నాబార్డ్, ఓఎన్‌జీసీ, ఎస్‌బీఐ, రిలయన్స్, గెయిల్, యూనియన్ బ్యాంకుల ప్రోత్సాహంతో ఈ మెగా ఈవెంట్‌కు శ్రీకారం చుట్టారు. జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ (డీఆర్‌డీఏ) ఆధ్వర్యాన వివిధ శాఖలకు చెందిన అధికారులు ఈ ఈవెంట్ నిర్వహణలో పాలు పంచుకుంటున్నారు.



ప్రదర్శనలో ఉంచనున్న క్వాయర్ ఉత్పత్తులు

గౌతమీ తీరం.. కల్యాణ సంరంభం

- నేటి నుంచి స్వామి వారి పరిణయోత్సవాలు
- రేపు రాత్రి కల్యాణ మహోత్సవం
- ముస్తాబయిన కోనసీమ తిరుపతి
- పూర్తయిన ఏర్పాట్లు


వాడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి


స్వామివారి పాత చిత్రం


విద్యుద్దీప కాంతుల్లో మెరిసిపోతున్న వాడపల్లి ఆలయం

ఆత్రేయపురం: కోనసీమ తిరుపతి.. వాడపల్లి క్షేత్రం కల్యాణ శోభను అద్దుకుంటోంది. శ్రీదేవి, భూదేవి సమేతుడై, ఇక్కడ స్వయంభువుగా వెలసిన శ్రీ వేంకటేశ్వర స్వామి వారి కల్యాణోత్సవాలు శుక్రవారం ప్రారంభం కానున్నాయి. వచ్చే నెల 7వ తేదీ వరకూ జరిగే ఈ ఉత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు ఆలయ కమిటీ, అధికార యంత్రాంగం విస్తృత ఏర్పాట్లు చేసింది.

మహత్తర చరిత్ర

మహత్తర చరిత్ర వాడపల్లి దివ్యక్షేత్రం సొంతం. అప్పట్లో ఈ ప్రాంతమంతా దండకారణ్యంలో భాగంగానే ఉండేది. పావన గౌతమీ గోదావరి నదీ తీరాన ఉన్న ఈ గ్రామాన్ని నాడు 'నౌకాపురి'గా, 'ఓడపల్లి'గా పిలిచేవారు. యుగాల కిందట ఈ ప్రాంతం రుషిపుంగవులతో తపోవనంగా విరాజిల్లేది. ఆ సమయంలో ఇక్కడ వేంకటేశ్వరస్వామి వారు స్వయంభువుగా రక్తచందన మూర్తిగా ఆవిర్భవించారు. నాడు స్వామివారి ప్రతిష్ఠా మహోత్సవంలో దేవర్షి నారదుడు కూడా పాల్గొన్నట్టు స్థల పురాణాన్ని బట్టి తెలుస్తోంది. కలియుగంలో స్వామి వారు భక్తులకు కలలో కనిపించి, తాను రక్తచందన మూర్తిగా గోదావరి నదిలో ఉన్నట్టు చెప్పారని అంటారు. అలా నదిలో లభ్యమైన స్వామి వారి విగ్రహాన్ని రుషులు మంగళ వాయిద్యాలతో ఊరేగింపుగా తీసుకుని వచ్చి ఆగమ శాస్త్రం ప్రకారం విగ్రహం లభించిన ప్రాంతంలోనే గౌతమీ గోదావరి ఒడ్డున ప్రతిష్ఠించారు. నాలుగు శతాబ్దాల కిందట స్వామి వారిని పునఃప్రతిష్ఠించినట్టు చరిత్ర ఆధారంగా తెలుస్తోంది.

పినపోతు గజేంద్రుడి చొరవతో..

మూడు శతాబ్దాల కిందట నౌకా వ్యాపారి పినపోతు గజేంద్రుడు వాడపల్లిలో నివసించేవాడు. ఆయనకు చాలా నౌకలుండేవి. ఒకసారి సంభవించిన తుపానులో ఆయన నౌకలన్నీ అదృశ్యమయ్యాయి. ఆ ఓడలు సురక్షితంగా ఒడ్డుకు చేరితే స్వామి వారికి గుడి కడతానని గజేంద్రుడు మొక్కుకున్నాడట. తుపాను తరువాత ఓడలు భద్రంగా ఒడ్డుకు చేరడంతో గజేంద్రుడు ఇక్కడ ఆలయం నిర్మించాడని చెబుతారు. వేంకటేశ్వర స్వామి వారి ఆలయ నిర్వహణకు గజేంద్రుడి స్నేహితుడు, నాటి పెద్దాపురం సంస్థానం మహారాజు రాజా వత్సవాయి తిమ్మ జగపతి 1759లో 275 ఎకరాలు దానంగా ఇచ్చారు. ధూపదీప నైవేద్యాలకు 110 ఎకరాలు, స్వామి వారి సేవలకు 165 ఎకరాలు సమర్పించారు. ఈ భూములపై అర్చకులు, నాయీబ్రాహ్మణులు తదితర వర్గాల వారికి వచ్చే హక్కులు కల్పించడం ద్వారా వారు ఆ ఆదాయంతో జీవనం సాగిస్తూ స్వామి వారికి సేవలు ప్రతి రోజూ ధూపదీప నైవేద్యాలు క్రమం తప్పకుండా అందిస్తున్నారు. అప్పటి నుంచీ ఏటా చైత్ర శుద్ధ ఏకాదశి నాడు వాడపల్లి తీర్థం, వేంకటేశ్వరస్వామి వారి కల్యాణోత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. అప్పట్లో స్వామి వారు మీసాలతో ఉండేవారు. కోనసీమ తిరుపతిగా ప్రసిద్ధి చెందిన ఈ క్షేత్రం ఇటీవల ఎంతో అభివృద్ధి చెందింది. ముఖ్యంగా ఏడు శనివారాల ప్రదక్షిణల మొక్కులతో వేలాదిగా భక్తులు తరలివస్తున్నారు.

కల్యాణోత్సవాలు జరగనున్నాయిలా..

- **నేడు:** అంకురార్పణ, ధ్వజారోహణం
- **ఏప్రిల్ 1:** రాత్రి 7.01 గంటలకు స్వామి వారి కల్యాణోత్సవం
- **2:** శాంతిహోమం
- **3:** పొన్నవాహనంపై గ్రామోత్సవం
- **4:** మహదాశ్వీరచనం, సదస్యం
- **5:** తెప్పోత్సవం
- **6:** మహా పూర్ణాహుతి, చక్రస్నానం
- **7వ తేదీ:** శ్రీ పుష్పోత్సవం

విశేషంగా అభివృద్ధి

కొన్నేళ్లుగా వాడపల్లి వెంకన్న స్వామి ఆలయం విశేషంగా అభివృద్ధి చెందుతోంది. గోశాల, భారీ రేకు షెడ్లు, అన్నదాన భవనం నిర్మించారు. తాజాగా రూ.5.5 కోట్లతో వకుళమాత అన్నప్రసాద భవనం నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. తిరుమల పుష్కరిణి మాదిరిగా ఇక్కడ కూడా స్వామి వారి తెప్పోత్సవం నిర్వహించేందుకు రూ.2.50 కోట్లతో కోనేరు ఏర్పాటు చేయనున్నారు. కాలి నడకన వచ్చే భక్తుల విశ్రాంతికి, సామూహిక వివాహాలు, ఉపనయనాలు జరిపించేందుకు వీలుగా కోట్లాది రూపాయలతో మూడంతస్తుల భవనం నిర్మిస్తున్నారు. రూ.65 లక్షలతో స్వామి వారికి శాశ్వత వార్షిక కల్యాణ వేదిక నిర్మించారు. నిత్యాన్నదాన పథకం నిర్వహించడంతో పాటు ఇతర సౌకర్యాలు కూడా కల్పించారు.



అంగరంగ వైభవంగా..

స్వామి వారి కల్యాణోత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లూ చేశాం. ప్రభుత్వ విప్, కొత్తపేట ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి సహకారంతో గతంలో ఎన్నడూ జరగని రీతిలో కల్యాణోత్సవాలు నిర్వహిస్తాం.

– రుద్రరాజు రమేష్‌రాజు, చైర్మన్, ఆలయ కమిటీ, శ్రీ వేంకటేశ్వరస్వామివారి దేవస్థానం, వాడపల్లి



భక్తులకు అసౌకర్యాలు కలగనివ్వం

భక్తులకు ఎటువంటి అసౌకర్యాలూ కలగకుండా అన్ని ఏర్పాట్లూ చేశాం. ఉత్సవాల నిర్వహణపై ఇప్పటికే అన్ని శాఖల అధికారులతో సమీక్షలు నిర్వహించాం. భక్తుల సంఖ్య పెరుగుతుందనే అంచనాతో ఏర్పాట్లు పూర్తి చేశాం.

– ముదునూరి సత్యనారాయణరాజు, కార్యనిర్వహణాధికారి

రమణీయం.. జగన్మోహినీ కేశవస్వామి కల్యాణం


జగన్మోహినీ కేశవస్వామి వారి కల్యాణం నిర్వహిస్తున్న పండితులు


కల్యాణోత్సవాన్ని తిలకిస్తున్న భక్తులు

ఆత్రేయపురం: ప్రసిద్ధ పుణ్యక్షేత్రం ర్యాలిలో స్వయంభువుగా వెలసిన శ్రీ జగన్మోహినీ కేశవస్వామి వారి కల్యాణ మహోత్సవం కన్నుల పండువగా జరిగింది. వైఖానస ఆగమ పండితుడు, పశ్చిమ గోదావరి జిల్లా మార్టేరుకు చెందిన శ్రీనివాసులు రామకృష్ణాచార్యులు ఆధ్వర్యాన వేద పండితులు, ఆలయ అర్చకులు కల్యాణ ఘట్టాన్ని గురువారం రాత్రి 8 గంటలకు కడు రమణీయంగా నిర్వహించారు. ఆలయంలో ప్రత్యేకంగా అలంకరించిన మండపంలో మంగళ వాయిద్యాల ఘోష నడుమ జరిగిన కల్యాణ వేడుకలను వీక్షించేందుకు భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. బుగ్గన చుక్కలతో వధువులుగా ముస్తాబైన శ్రీదేవి, భూదేవి అమ్మవార్లతో స్వామి వారి కల్యాణ మహోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. తొలుత స్వామి వార్ల ఉత్సవ మూర్తులను కల్యాణ మండపం వద్దకు తోడ్కొని వచ్చారు. విష్వక్సేన పూజ, పుణ్యాహవాచనం, నిత్యహోమం, అగ్నిప్రతిష్ఠాపన, ధ్వజారోహణ, అంకురార్పణ తదితర క్రతువులను ఆగమ శాస్త్రానుసారం నిర్వహించారు. జెడ్పీటీసీ సభ్యుడు బోణం సాయిబాబు దంపతులు, ఈఓ బి.కృష్ణచైతన్యులు స్వామి, అమ్మవార్లకు పట్టు వస్త్రాలు, మంగళసూత్రాలు సమర్పించారు. ఉదయం పూలమాలలతో ప్రత్యేకంగా అలంకరించిన గరుడ వాహనంపై స్వామి వారికి గ్రామోత్సవం నిర్వహించారు. ఎస్సై సీహెచ్ సుధాకర్ ఆధ్వర్యాన పోలీసు బందోబస్తు నిర్వహించారు.

అయ్యారే.. ఎంత గొప్ప సారె!


సీతమ్మకు సమర్పించిన కోవా కంత (సారె)


సీతారాముల కల్యాణం నిర్వహిస్తున్న పండితులు

పి.గన్నవరం: స్థానిక పాత అక్విడెక్టు సమీపంలోని శ్రీ పట్టాభి రామాలయంలో శ్రీ సీతారామస్వామివారి కల్యాణ మహోత్సవం గురువారం కన్నుల పండువగా జరిగింది. ఆలయ ధర్మకర్తలు పేరిచర్ల భీమరాజు, సత్యవాణి దంపతుల ఆధ్వర్యాన జరిగిన కల్యాణోత్సవాన్ని వీక్షించేందుకు పెద్ద ఎత్తున భక్తజనం తరలివచ్చారు. సత్యవాణి దంపతుల ఆధ్వర్యాన కోవాతో వివిధ ఆకృతుల్లో తయారు చేయించిన 108 రకాల స్వీట్లు, పిండి వంటలను శ్రీరాముని తరఫున సీతమ్మ వారికి సారె(కంత)గా సమర్పించారు. అర్చక స్వామి వాడపల్లి రాంబాబు నేతృత్వంలో కల్యాణ మహోత్సవం నిర్వహించారు. కోవాతో తయారు చేసిన స్వీట్లు, ఇతర పిండి వంటలు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి.

సముద్రంలోకి 400 ఆలివ్ రిడ్లీ తాబేళ్లు


ఆలివ్ రిడ్లీ తాబేలు పిల్లలను సముద్రంలోకి వదులుతున్న అటవీ అధికారులు

తాళ్లరేవు: కోరంగి పంచాయతీ పరిధిలోని హోప్ ఐలాండ్ వద్ద 400 ఆలివ్ రిడ్లీ తాబేలు పిల్లలను సముద్రంలోకి విడుదల చేసినట్టు అటవీ అధికారులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. గుంటూరు అటవీ శాఖాధికారి వై.మధుసూదన్‌రెడ్డి కోరింగ వన్యప్రాణి సంరక్షణ కేంద్రంలోని హోప్ ఐలాండ్‌లో సముద్ర తాబేళ్ల సంరక్షణ, ఉత్పత్తి కేంద్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన తాబేలు పిల్లలను సముద్రంలోకి వదిలారు. అలాగే కోరింగ ఫారెస్ట్ కాంప్లెక్స్‌లో అతిథి గృహం, మూడు గుడిసెలను ప్రారంభించారు. కార్యక్రమంలో తూర్పు గోదావరి, కాకినాడ జిల్లాల అటవీ అధికారులు ఎస్.శరవణన్, ఐకేవీ రాజు, ఫారెస్ట్ రేంజర్ ఎస్ఎస్ఆర్ వరప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.